

రౌతులపూడి నుంచి ఆర్‌టిసి సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి నుండి తుని ఆర్‌టిసి అధికారులు సర్వీస్ శనివారం ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు నిరసన తెలియజేసి తుని ఆర్‌టిసి అధికారులకు వినతిపత్రం అందజేయడంతో తుని రౌతులపూడి నుండి తుని ఆర్టీసీ సౌకర్యాన్ని కల్పించడంతో విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు గంగా సూరిబాబు బసు సర్వీస్ ప్రారంభించిన ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వరహాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న సిబ్బంది


ప్రత్తిపాడులో సంఘటితమైన శ్రామక మహిళలు

శ్రామిక మహిళా హక్కుల సాధనకు పోరాటం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

శ్రామిక మహిళల హక్కులు సాధించుకోవడానికి సంఘటితంగా పోరాడాలని జిల్లా శ్రామిక మహిళ నాయకురాలు ఈ చంద్రావతి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో శనివారం వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా ఇచ్చేశారు. మహిళల ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, మహిళలపై దాడులు, వేతనాలలో వ్యత్యాసాలు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ సౌకర్యాల కోసం సంఘటితంగా పోరాటాలని ఆమె పిలుపునిచ్చారు. మండలంలోని 15 మందితో శ్రామిక మహిళా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా బి.తులసి, కో కన్వీనర్లుగా ఐ.అప్పలరాజు, పద్మావతి ఎన్నికయ్యారు. కార్యక్ర మంలో లక్ష్మి, సత్య, కళ్యాణి, అనంతలక్ష్మి, హేమలత, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.


అన్నవరం పంపానదిలో తెప్పఉత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కన్నుల పండువగా సత్యదేవుని తెప్ప ఉత్సవం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శ్రీ వీరవెంకట సత్యన్నారాయణ స్వామి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్తీక మాసం క్షీరాబ్ది ద్వాదశి శనివారం సాయంత్రం కొండదిగువన ఉన్న పంపా సరోవరం తీరం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై సత్యదేవుడ్ని సతీసమేతంగా ఆసీనుల ప్రత్యే పూజలు నిర్వహించారు. దేవస్థానం ఇఒ ఎన్.వి. ఎన్.ఎన్ మూర్తి, ఛైర్మన్ ఐ.వి.రోహిత్ సమక్షంలో స్వామి అమ్మవార్లకు మంగళ వాయిద్యాలతో పంపా సరోవరం తీరం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు, గజ ఈతగాళ్లను, తుని అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అలంకరణ బాణా సంచాకాల్పులు, యాత్రికులను అలరించాయి. కార్యక్రమంలో దేవ స్థానం ఏ.సి రమేష్ బాబు ,సుంకర మురళీమోహన్, సి.ఐ కిషోర్ బాబు,ఎస్.ఐ శోభన్ కుమార్, పి.ఆర్.ఓ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చీడీలపోర స్థలాల కేటాయింపుపై పరిశీలన

- పిఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు నూతన భవనం మంజూరు
- వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలపై నివేదికకు ఆదేశం
- బాలికల వసతి గృహంలో కలెక్టర్ తనిఖీలు


చీడీల పోర స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్..


ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

చీడీల పోరలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రహదారి వేయగా, మిగిలిన ప్రాంతంలో దాదాపు 43 సామాజిక భవనాలకు కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా శనివారం పరిశీలించి ప్రతిపాదిత పనులపై కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. కాకినాడ పట్టణంలో పి.ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు నూతన భవనం, మరుగుదొడ్లను మనబడి నాడు-నేడు లో మంజూరయిన భవనానికి త్వరలోనే శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శనివారం ఆమె కాకినాడ పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఆయా శాఖల ద్వారా నిర్వహిస్తున్న పనులను పరిశీలించి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రెవెన్యూ మున్సిపల్ కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలిసి మిలటరీ రోడ్డు శారదాదేవి ఆలయ ప్రాంతంలోని చీడీలపోర కాలువ, డ్రైన్ నిర్మాణ పనులను సందర్శించారు. ఈ ప్రాంతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను ఆరా తీశారు. ముఖ్యంగా చీడీల పోరలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రహదారి వేయగా, మిగిలిన ప్రాంతంలో దాదాపు 43 సామాజిక భవనాలకు కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టరు పరిశీలించి ప్రతి పాదిత పనులపై కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఆయా సామాజిక వర్గాలకు స్థలాలు కేటాయించిన అంశానికి సంబంధించిన వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారులు జిల్లా కలెక్టరుకు వివరించారు. కొండయ్యపాలెం రైల్వే బ్రిడ్జికి అనుసంధానంగా నిర్మించిన 80 అడుగుల రహదారిని ఎస్వీరంగారావు విగ్రహం వరకు అనుసంధానం చేసే అంశంపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఇందుకోసం మరో అరకిలోమీటర్ వరకు భూసేకరణ చేయాల్సి వుందని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇంద్రపాలెం- చీడీ పోర డ్రెయిన్‌ను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కాకినాడ బాలాజీ చెరువు సెంటర్ వద్దనున్న పి.ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టరు కృతికా శుక్లా డీఈవో డీ సుభద్ర, సమగ్ర శిక్ష, ఆర్ అండ్ బి, అటవి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న ఒకేషనల్ కళాశాల తరగతి గదులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ కాకినాడ పట్టణ పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎన్నో ఏళ్లుగా కళాశాల విద్యను అందించడంలో ఎంతో పేరుగాంచిన పి.ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు సంబంధించి కొత్త బిల్డింగ్ పాటు టాయిలెట్స్ ను మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని ఆమె వివరించారు. ఇక్కడ ఉన్న మూడు బిల్డింగులు బ్రిటిష్ కాలంలో నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఈ బిల్డింగ్స్ ను తొలగించి కొత్త భవనాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పి.ఆర్ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 882 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కన ఉన్న వేరే బిల్డింగ్స్ లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డీఈఓ డి. సుభద్ర, డీవీఈఓ వనజ, జిజికె.నూకరాజు, సమగ్ర శిక్ష ఎస్.ఈ నటరాజన్, పి.ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జగన్నాధపురం చర్చి స్క్వేర్ సెంటర్ వద్ద సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సాంఘిక సంక్షేమం, ఏపీఈడబ్ల్యుఐడిసి ఇతర ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ నిర్మించనున్న నూతన వసతి గృహ నిర్మాణ పనులకు సంబంధించి వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చర్చి స్క్వేర్ సెంటర్ దగ్గరలో ఉన్న చౌక ధరల దుకాణం (రేషన్ షాపు నెంబర్ 113) ను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం నిల్వలను, తూనిక విధానాన్ని ఆమె తనిఖీ చేశారు. వాహనం ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న విధానాన్ని కూడా కలెక్టరు పరిశీలించారు. బాలాజీ చెరువు సెంటర్ వద్దనున్న బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ బాలుర వసతి గహాన్ని పరిశీలించి 2003-04లో నిర్మించిన భవనానికి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి తిరిగి వినియోగానికి తీసుకురావాలని అధికారులకు కలెక్టరు ఆదేశించారు. కలెక్టరు వెంట కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్య కుమారి, కాకినాడ ఆర్డీవో బీవీ.రమణ, పట్టణ తహశీల్దార్ వైహెచ్ఎస్. సతీష్, డిప్యూటీ సిటీప్లానర్ కె.హరిదాసు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జే.రంగలక్ష్మీదేవి, ఇరిగేషన్ ఈఈ సుబ్బయ్య, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ ఉన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలపై కలెక్టర్ ఆరా

సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశం

జిల్లాలో వివిధ వైద్య ఆరోగ్య విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నిర్వహించిన కాంట్రాక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా జరిగిన నియామకాలు, ఆయా విభాగాలలో ఇంకా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలపై సోమవారం నాటికి సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ వైద్య, ఆరోగ్య విభాగాలలో ఖాళీల భర్తీ అంశంపై ఆయా యాజమాన్యాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జిజిహెచ్, కాకినాడ, రంగరాయ వైద్య కళాశాల, వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రులు, రాజమండ్రి జిల్లా ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఇతర ఆరోగ్య విభాగల పరిధిలో మొత్తం 321 పోస్టులకు ఇటీవల నిర్వహించిన కాంట్రాక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా 205 పోస్టులు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈ ప్రక్రియ అనంతరం ఇంకా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమీక్షించి, వారి భర్తీకి చేపట్టవలసిన ప్రతిపాదనలతో సోమవారం నాటికి సమగ్ర నివేదిక అందజేయాలని ఆయా విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డియంహెచ్ఓ డా.శాంతిప్రభ, డిసిహెచ్ఎస్ డా.సనత్ కుమారి, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరశింహం, ఆయా విభాగాల ఏఓలు, ఏడీలు పాల్గొన్నారు.


పట్టాభి ఆగ్రో పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

'పట్టాభి' ఆగ్రో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి ఆగ్రోఫుడ్స్ పరిశ్రమ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు దేవాబత్తుల రమేష్ మాట్లాడుతూ తమకు కార్మిక సదుపాయాలు కలగచేయాలని కోరుతూ ఆందోళన చేపట్టిన కార్మికులను ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ తర్వాత ఒక్కరొక్కరిగా 20 మందిని విధుల నుండి తొలగించారన్నారు. ఈ కార్మికులందరూ విధులకు అప్ స్కాండ్ అయ్యారని యాజమాన్యం డీసీఎల్ కార్యాలయంలో చెప్పడం అన్యాయమన్నారు. కార్మికుల సమ స్యలను పరిష్కరించడం మానేసి అబద్ధాలు చెప్పడం దుర్మార్గమన్నారు. సిఐటియు నాయకులు డి క్రాంతికుమార్ మాట్లాడుతూ స్థానిక పరిశ్రమలలో 75 శాతం మంది సిబ్బందిని స్థానికులనే తీసుకోవాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెబుతుంటే పట్టాభి అగ్రో ఫుడ్స్ యాజమాన్యం మాత్రం కార్మికులను తొలగిస్తున్నారన్నారు. తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు,కే అప్పన్న, డి. కృష్ణ, వడ్డి సత్యనారాయణ,శివ,పెంకే శ్రీను, వరప్రసాద్, బాలరాజు, జాన్, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీమోహన్

సమష్టి సహకారంతోనే అవినీతి నిర్మూలన సాధ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

అవినీతి నిర్మూలన అనేది సమష్టి సహకారంతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని పెద్దాపురం డి.ఎస్.పి మురళీమోహన్ తెలిపారు. సూరంపాలెంలో ఉన్న పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పిల్లలను విలువలతో పెంచాలని, పిల్లలు ఆదర్శంగా తీసుకునేలా పెద్దవారు ప్రవర్తిస్తే పెద్దవారిని చూసే పిల్లలు నేర్చుకుంటారని తెలిపారు. పవర్ గ్రిడ్ డి.జి.ఎమ్ ఎస్.ఎస్. ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలని అవినీతికి దూరంగా ఉంటారన్నారు. పవర్ గ్రిడ్ ఉద్యోగులు అవినీతి ఎక్కడ జరిగినా ఉపేక్షించరాదని తెలిపారు. అంతకుముందు డి.ఎస్.పి.మురళీమోహన్, గండేపల్లి ఎస్.ఐ గణేష్ పవర్ గ్రిడ్ ఆవరణలో మొక్కలు నాటారు. చివరిగా వందన సమర్పణ చేసిన హెచ్.ఆర్. డిప్యూటీ మేనేజర్ కోటేశ్వరరావు వారోత్సవాలలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వివిధ పోటీల విజేతలను ప్రకటించారు.

కార్పొరేషన్ ఉద్యోగుల ప్రతిజ్ఞ

కాకినాడ అవినీతి రహితంగా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ ఈ మేరకు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో శిరీష్,101 కోఆర్డినేటర్ శైలజ, పలువురు సూపరిం టెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, వివిధ కేటగిరీల ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ. 1.83 లక్షల సరుకు జప్తు

ఇద్దరి వ్యక్తులపై ఎఫ్ఐఆర్ :

జాయింట్ కలెక్టర్ కోర్టు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాబీ రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి శనివారం నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద ముగ్గురుపై నమోదైన రెండు కేసులను విచారించి, సీజ్ చేసిన సుమారు రూ.1.83 లక్షల విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రకటనలో తెలిపారు. సరుకు అక్రమ రవాణాకు ఉపయోగించిన ఒక వాహన దారుకు రూ.5 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఇద్దరు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఉత్తర్వులు ఇచ్చినట్లు జెసి తెలిపారు.

నేటి స్పందన తాళ్లరేవులో

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల మొదటి సోమవారం 7వ తేదీన జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమాన్ని తాళ్ళరేవులోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 9:30 గంటల నుండి నిర్వ హిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశపు హాలులో ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఉపాధి కూలీలతో మండల పరిషత్ ఆవరణలో ఉన్న తుప్పలను తొలగించి ఆవరణ అంతా శుభ్రం చేశారు. ఏర్పాట్లను ఎంపీడీవో ఎం.అనుపమ, తహశీల్దార్ పోతురాజు పర్యవేక్షించారు.

కార్టూ'నిజం'



ప్రజలతో ఆడడం అలవాటైపోయింది మరి..!!


కోటనందూరులో ప్రజలతో మాట్లాతున్న మంత్రి దాడిశెట్టి రాజా

గడప గడపకూ...

ప్రజాశక్తి కోటనందూరు

శనివారం కోటనందూరులో స్థానిక సర్పంచ్ గరిశింగు శివలక్ష్మి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను వింటూ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయో లేదని నేరుగా అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో సిసి రోడ్లు నిర్మించాలని మంత్రిని ప్రజల విన్నవించుకున్నారు. సిసి రోడ్లు లేని అన్ని వీధుల్లోనూ రోడ్లు డ్రైనేజీలు నిర్మాణము వెంటనే చేపట్టనున్నటుట ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లగుడు శ్రీనివాస్ తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మాకినేడు బాబు వైస్ ఛైర్మన్ వెలగా వెంకట కృష్ణాజి, వైస్ ఎంపిపి కే.రమణమ్మ కష్ణ బంటుపల్లి గంగాధర్, కోఆప్షన్ సభ్యులు జగటాలకోట సత్తిబాబు, చింతకాయల చినబాబు గొర్ల రామచంద్ర రావు, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** 10వ డివిజన్ దుమ్ములపేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇంటింటికి వెళ్ళి నవరత్న పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

ప్రేమదేశం చిత్ర యూనిట్ సందడి


ఐడియల్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రేమదేశం చిత్ర దర్శకుడు శ్రీకాంత్

ప్రజాశక్తి - కాకినాడ

ఐడియల్ కాలేజీలో ప్రేమ దేశం చిత్ర యూనిట్ శనివారం సందడి చేశారు. సరదా సరదా కబుర్లతో విద్యార్థులను మైమరిపించారు. చిత్ర కథానాయిక మేఘా ఆకాంక్ష చిట్టి పొట్టి మాటలు కడుపుబ్బా నవ్వించే ప్రయత్నం చేశారు. ఐడియల్ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వాసు కొప్పిశెట్టి అందించిన ఆతిథ్యం చిత్ర బృందానికి సంతోషాన్ని కలిగించింది. ఈ చిత్ర దర్శకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రేమలో వైవిధ్యమైన అంశాన్ని కథా వస్తువుగా తీసుకుని అన్నిరకాల పాత్రల మేళవింపుతో అల్లిన ప్రేమ కథ ఈ ప్రేమ దేశం సినిమా అని అన్నారు. నేటి తరంలో అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంద న్నారు. హీరో శివ మాట్లాడుతూ దాదాపు 7 చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించి ప్రేక్షకుల మన్ననలు పొందానని తాను తొలి సారిగా హీరోగా ప్రేమదేశం తో పరిచయం జరిగిందని తనను ఆశీర్వదించాలని కోరారు. హీరోయిన్ మేఘా ఆకాంక్ష మాట్లాడుతూ మంచి సినిమాను పెద్ద మనసుతో విజయం అందించే రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఐడియల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వాసు కొప్పిశెట్టి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రమోషన్ కోసం వచ్చిన ప్రతి సినిమా కూడా విజయవంతం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ డాక్టర్ పి. చిరంజీవిని కుమారి, డైరెక్టర్ మెర్ల రంజిత్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ సుచరిత, పాలిక ఉషారాణి తదితులున్నారు.


పిఠాపురం తాలూకా నూతన కమిటీ సభ్యులు

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పిఠాపురం తాలూకా యూనిట్ ఎన్నిక శనివారం పిఠాపురం ఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో నిర్వహించినట్లు జిల్లా ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ సహ అధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు తెలిపారు. ఈ మధ్యకాలంలో బదిలీపై కొంత మంది కార్యవర్గ సభ్యులు వెళ్లడంతో కోఆప్షన్ ద్వారా పరిశీలకులుగా అధ్యక్షులు తనను నియమించారన్నారు. కోఆప్షన్ ద్వారా అధ్యక్షులుగా ఎ.శ్రీకష్ణ, ఉపాధ్యక్షుడిగా ఆర్.సత్యనారాయణ, కె. హైమా, కార్యదర్శిగా పి.సురేష్ కుమార్‌ను ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యాక్షులు సరెళ్ల చంద్రరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **పెద్దాపురం**పెద్దాపురం తాలూకా ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం స్థానిక ఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో జరిగిన ఈ ఎన్నికలలో ఒక్కొక్క పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి డి దుర్గాప్రసాద్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా డిడి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా బి ప్రమోద్, ఉపాధ్యక్షులుగా టి.సాయిబాబు, సిహెచ్ ఉమాదేవి, ఎస్.కె అన్సారి వలి, సహాయ కార్యదర్శులుగా ఎండి రియుద్దీన్, పి.విశాలాక్షి, ఎం సత్యానందం, మహిళా సహాయ కార్యదర్శిగా బి.శ్రీవల్లి, కోశాధికారిగా అభిషేక్‌లు ఎంపిక య్యారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఏవివి అప్పలరాజు, పరిశీలకులుగా పాలకుర్తి మూర్తి బాబులు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి వేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పెద్దాపురం తాలూకా నూతన కమిటీ సభ్యులు

రౌడీ పాలనకు వైసిపి నిదర్శనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నందిగామ పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసిపి రౌడీ మూకలు రాళ్లు రువ్వడం వైసీపీ ప్రభుత్వ రౌడీ పాలనకు నిదర్శనమని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు విమర్శించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి రౌడీ మూకలు రాళ్లతో దాడి చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను లేకుండా చేయాలని చూస్తున్న జగన్ రెడ్డికి ప్రజలే 2024లో సరైన బుద్ధి చెప్తారని, జగన్ రెడ్డి పరిపాలనలో కనీసం సమస్యలు చెప్పుకునే వీలు కూడా సామాన్య జనాలకు లేదని, రాష్ట్రంలో ప్రజా సమస్యలను సమస్యలను ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం తప్ప వైకాపా నాయకులకు పరిపాలన చేతకాదని, ఎన్ని కేసులు పెట్టిన, ఎన్ని ఇబ్బందులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని గడప గడపకు వైసీపీ ఎమ్మెల్యేలు వెళుతుంటే ఏ రకంగా బుద్ధి చెపుతున్నారో రాష్ట్రం లో ప్రజలందరూ చూస్తున్నారని, తెలుగుదేశం పార్టీ పై ప్రజలు చూపుతున్న జన ఆదరణ చూసి ఓర్వలేక ఈరకంగా దాడి చేస్తున్నారని ఆయన విమర్శించారు.

టిడిపి మహిళల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

వైసిపి రౌడీ రాజకీయానికి పరాకాష్టని జిల్లా మహిళా తెలుగు అధ్యక్షురాలు, మాజీ మేయర్ శంకర పావని తిరుమల కుమార్ చంద్రబాబు నాయుడు కాన్వాయిపై జరిగిన రాళ్ల దాడిని ఖండించారు. స్థానిక సంతచేరువు సెంటర్‌లో టిడిపి శ్రేణులతో కలిసి పావని నిరసన తెలియజేశారు. చంద్రబాబుపై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దాడికి పాల్పడిన వారిని శిక్షించాలన్నారు. ఇకముందు ఇటువంటి ఇటువంటి చర్యలకి పాల్పడితే తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వుంటుందని సుంకర పావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున కొండబాబు


పార్టీ మహిళలతో నిరసన వ్యక్తం చేస్తున్న సుంకర పావని

సబ్ రిజిస్టర్, అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయాల భవనాలను

ఖాళీ చేయాలంటూ ఎస్‌బిఐ నోటీసులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అద్దె భవనంలో కొనసాగుతున్న సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని, పక్కనేవున్న ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయాన్ని తక్షణమే ఖాళీ చేయాలంటూ ఆ కార్యాలయానికి సామర్లకోట స్టేట్ బ్యాంకు నుండి నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు రెండు కార్యాలయాల బయట గోడలకు నోటీసులను అంటించారు. సొంత స్థలం ఉండి నిధులు మంజూరైనా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని నిర్మించుకోలేకపోయారు. గతంలో స్టాంప్ అండ్ రిజిస్టేషన్ శాఖ మంత్రి ఉన్న తోట నరసింహం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయినా అప్పటో ఉన్న అధికారులు వాటిని సద్వినియోగం చేసుకోలేక పోయారు. ఆదాయం ఉన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యలయం అద్దె భవనంలోనే నేటికీ కొనసాగుతోంది. ఎడీబీ రోడ్డు చెంతన స్థానిక సత్యనారాయణ పురంలో ఉన్న రాజా చిన్నారావు ఫంక్షన్ హాల్ గ్రౌండ్ ఫ్లోరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సుమారు 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనానికి రూ.15 వేలు అద్దె చెల్లిస్తున్నారు. అయితే భవన యజమాని బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి ఈ భవనాన్ని హామీగా పెట్టారు. యజమాని బ్యాంకు అప్పు చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు కోర్టును ఆశ్రయించారు. దానితో కోర్టు భవన స్వాధీనపు హక్కును బ్యాంకు అధికారులకు ఇచ్చారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు భవనంలో ఉన్న పలువురు షాపులను అధికారులు సీజ్ చేశారు. అదే విధంగా భవనం గ్రౌండ్ ఫ్లోరులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయాలు ఉండగా వాటికి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఈ విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉన్నతాధికారుల కోరిన మేరకు వారికి అధికారులు కొంత గడువు ఇచ్చారు. కాగా మరి కొద్ది రోజుల్లో ఈ కార్యాలయాన్ని మాజేటి నగర్ లో ఉన్న మరో అద్దె భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఇప్పటికే మార్పుచేస్తూ అయోధ్య రామాపురం ప్రాంతంలో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారికి సొంత భవనం స్థానిక బలుసుల పేటలో నిర్మాణంలో ఉండి ఇంకా పూర్తి కాలేదు. తాత్కాలికంగా అయోధ్య రామపురంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. కాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థానిక బ్రౌన్ పేటలోని ట్రాన్స్ కో కార్యాలయం వద్ద సొంతం స్థలం ఉండగా ఎంతకాలం అద్దె భవనాల్లో కొనసాగిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


ఇంజనీరింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏజెఎఫ్ సి మెజిస్ట్రేట్ హర్షవర్ధన్

కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పెద్దాపురం మండల న్యాయ సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏజెఎఫ్‌సి మెజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి జీవితం న్యాయవ్యవస్థతో ముడిపడి ఉంటుందన్నారు. విద్యార్థి దశనుండే చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో సామాన్య జనానికి చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. సీఐ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ దిశ చట్టం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో నిర్వహించిన చట్టాలపై అవగాహన ర్యాలీని మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ ర్యాలీ దివిలి, చంద్రమాంపల్లి మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బేబీరెడ్డి శ్రీనివాసరావు,అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు,ఏపీ సందీప్,ప్యానల్ న్యాయవాదులు మడికి రాంబాబు, ఎస్ విశాలాక్షి, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ,ఆకుల మురళీకృష్ణ,మాసా చంద్రరావు, కుంచె నాని బాబు, రేమాపాని పాల్గొన్నారు.

అన్నవరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలో ఉన్న ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌ను ఏపీఎస్ జోనల్ చైర్మన్ గడుల బంగారమ్మ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఆమె ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో వివిధ స్టాల్స్‌ను, క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. అన్నవరం రత్నగిరి తగ్గట్టుగా ప్లాట్ ఫామ్‌ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాంప్లెక్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే కార్గో పాయింట్ విస్తీర్ణత పెంచాలన్నారు. తాను త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చేస్తానని ఆమె తెలిపారు. ఆమె వెంట జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, తుని ఆర్‌టిసి డిపో మేనేజర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

నైపుణ్యా అభివృద్ధి తోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు మరుచుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బేబీరెడ్డి శ్రీనివాసరావు అన్నారు.శనివారం పెద్దాపురం మండలం దివిలి గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ తరగతుల ప్రారంభ సభలో ఆయన ప్రసంగించారు. ప్రిన్సిపాల్ సర్వ రామకృష్ణుడు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భాషాపరమైన, సాంకేతిక పరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారన్నారు. సివిల్ డిపార్ట్మెంట్ హెడ్ వీరేంద్ర చౌదరి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణం పై విచారణ

ప్రజాశక్తి - కాజులూరు

ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై కలెక్టర్ స్పందన కార్యక్రమంలో శలపాక గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం తహశీల్దార్ సత్యనారాయణ ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఇందిరాదేవి విచారణ నిర్వహించారు. శలపాక గ్రామంలో పాఠశాల చెంతనే ప్రభుత్వ స్థలం ఉండటంతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో స్థానికులు కొంతమంది పాఠశాల చెంతనే ఆరోగ్యకేంద్రం ఉండటం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి పీడీ ఇందిరాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుండి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేమేశ్వరరావు పంచాయితీ కార్యదర్శి అనంతలక్ష్మి గ్రామ రెవెన్యూ అధికారి గనికమ్మ సర్పంచ్ పి.గనిరాజు ఎంపిటిసి సభ్యులు దడాల రమేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

10 న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపిడిఒ సీహెచ్. ఇందిరాదేవి శనవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు సర్పంచ్లు హాజరుకావాలని డివిజన్ , మండలస్థాయి అధికారులు తమ శాఖ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

గోదారి గలగలలు

ఆవేదన.... ఆందోళన....

ఆవేదన.... ఆందోళన....

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు ఓ వైపు, పారిశుధ్య నిర్వహణ లోపం మరో వైపు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. గతేడాదితో పోల్చితే డెంగీ, టైఫాయిడ్ కేసులు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పిహెచ్‌సిలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పల్లెల్లో ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించక తప్పటం లేదని రోగులు వాపోతున్నారు. అప్పటికీ తగ్గకపోతే జిల్లా కేంద్రాల్లోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రులకు వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫ్యామిలీ ఫిజీషన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ కొన్ని ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుంటోంది. విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి జనవరి నుంచి పూర్తి స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. వాటితో పాటు ప్రస్తుతం ప్రభుత్వ పిహెచ్‌సిలలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ పరీక్షే.

పాఠశాల విద్య పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న విధానం విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులకూ పరీక్షలా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విధానంలో 1, 2 తరగతుల విద్యార్థులకు ప్రశ్నపత్రాల్లోని అన్ని ప్రశ్నలు టీచర్లు చదివి వినిపించి వారితో జవాబులు రాయించాల్సి ఉంటుంది. ఈ రెండు తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో జవాబులను టీచర్లే బబుల్ చేయాలి. 3వ తరగతి విద్యార్థులకు నాలుగు ప్రశ్నలు, 4, 5 తరగతుల విద్యార్థులకు ఒక్కో ప్రశ్న పెద్దగా చదివి విద్యార్థులకు వినిపించి ఓఎంఆర్ షీట్‌లో జవాబులను బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో దిద్దాలి. ఈ విధానం అసాధ్యంగా మారిందని టీచర్లు వాపోతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఎట్టకేలకు 4 నెలల అనంతరం జరిగే ఈ పరీక్షలు గందరగోళంగా మారాయి. మొత్తం ఆరు సబ్జెక్టులకు ఒకే ఓఎంఆర్ షీట్‌ను అందజేసి ప్రతి రోజూ భద్రపరచడం తిరిగి విద్యార్థికి అందజేయాలనే నిబంధనలు తలనొప్పిగా మారాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనాలోచిత విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో గందరగోళం నెలకొని ఫలితాలు తారుమారవుతాయనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

చిగురించిన ఆశలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏలేరు కుడి కాల్వకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయటంతో మెట్ట ప్రాంత రైతుల ఆశలు చిగురించాయి. గోకవరం మండలంలో గుమ్మళ్ళ దొడ్డిలో బయో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన విషయం విధితమే. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు కుడికాల్వకు నిధులు కేటాయించాలని కోరటంతో సభ అనంతరం ముఖ్యమంత్రి నిధులు మంజూరుచేసినట్టు తెలిపారు. త్వరిత గతిన పనులు ప్రారంభించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు వివిధ సమస్యలపై నిర్వహించిన ఆందోళనలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. 'అయ్యన్న' అరెస్టును వ్యతిరేకంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేశారు. బయో ఇథనాల్ సంస్థ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసనలకు పిలుపు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను నిర్బంధానికి గురి చేశారు. సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించిన జనసేన పార్టీ కార్యకర్తలను సైతం అడ్డుకున్నారు. మొత్తం మీద కట్టుదిట్టమైన భద్రతా బలగాల మధ్య ముఖ్యమంత్రి సభను ముగించేశారని అభిప్రాయం ప్రజలు, ప్రతిపక్ష పార్టీల్లో వ్యక్తమైంది.

విద్యార్థుల ఆందోళనలు

కందుకూరి విద్యా సంస్థల ప్రహరీ లోపల ఉన్న ఆస్తుల మొత్తాన్ని ప్రభుత్వానికి అప్పచెప్పాలని విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ దశల వారీ ఆందోళనలు చేపట్టింది. రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. నిరుపేదలకు విద్య, వితంతు వివాహాలు, అనాథ శరణాలయాల కోసం కందుకూరి వీరేశలింగం ఈ సమాజాన్ని స్థాపించారు. ఉన్నత ఆశయాల కోసం స్థాపించిన ఈ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు.

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ అధికారులను కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉప్పాడ పంచాయితీ పరిధిలో ఉన్న సూరాడ పేట గ్రామానికి ఇళ్ల స్థలాలకు, ఇటువంటి సామాజిక సంస్థలకు స్థలాన్ని వైసిపి పార్టీ నాయకులు కబ్జా చేసి అమ్ము కుంటున్నారని సూరాడపేట గ్రామానికి చెందిన కొంతమంది శనివారం పిఠాపురం టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ వర్మని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన వర్మ ఫోన్ ద్వారా అధికారులతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి చెందిన వారికి ఇళ్ల స్థలాలు కొరకు, ప్రజలు అవసరాల కొరకు కమ్యూనిటీ హాల్, పిల్లలకు స్కూల్ నిమిత్తం లే-అవుట్ చేసి ఇచ్చిన భూమిని సెంటు రూ.2 లక్షలు చొప్పున ఈ కమ్యూనిటీ స్థలం విలువ 70లక్షలకు అమ్మేశారని ఆరోపించారు. అలాగే మెయిన్ రోడ్ లో ఉన్నా క్యాంటీన్ కొరకు కేటాయించిన స్థలాన్ని కూడా వైసిపి ఎంఎల్ఎ రూ.50 లక్షలకు అమివేశారని ఆరోపించారు. గ్రామ మత్స్యకార ప్రజలు ప్రభుత్వ ఆస్తిని కాపాడమని పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఎంఎల్ఎ ఒత్తిడి వలన ఏమి చేయలేని పరిస్థితిలో స్థానిక అధికారులు ఉన్నారని తెలిపారు. తక్షణమే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సూరాడ నాగేశ్వరరావు, వోడిపల్లి ప్రసాద్, మేరుగు భూషణం, చొక్కా కృష్ణ, సూరాడ జానకి, కోడ కృష్ణ, సత్తిరాజు, కృష్ణ, అప్పన్న మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మన్యంవారిపాలెం వీఆర్‌ఓకు సస్పెన్షన్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - కాకినాడ

జగ్గంపేట మండలం, మన్యంవారిపాలెం గ్రామంలో గ్రేడ్-2 వీఆర్‌ఓ గా పనిచేస్తున్న బెల్లపు రాజు ను పట్టాదారు పాసు పుస్తకాల జారీ, భూముల రిజిస్ట్రేషన్ అంశాల కొరకు రామవరం, మన్యంవారిపాలెం రైతుల నుండి సొమ్ము వసూలు చేసి అవినీతికి పాల్పడినందుకు, ఇర్రిపాక గ్రామ లబ్దిదారులకు ఓటిఎస్ పట్టాలను పంపిణీ చేయనందుకు, మద్యం సేవించి విధులకు హాజరు కావడం, తరచుగా గైరుహాజరు కావడం కారణాలపై సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు పద్మనాభం

త్వరలో పెన్షనర్స్ 'మనం-మన కోసం'

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కొరకు ఏపీవర్లు ప్రీమియం లేని మనం-మనకోసం సంక్షేమ పథకం త్వరలో ప్రారంభమవుతుందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం, కార్యదర్శి శాస్త్రి తెలిపారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం కాకినాడలోని పెన్షనర్స్ భవన్ లో జరిగింది. నూతన జిల్లాల ఏర్పాటుతో అసోసియేషన్ కొనసాగి, రాజమండ్రి శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూనియన్ డాక్టర్ సిహెచ్. కరుణాకర్‌రెడ్డి పెన్షనర్ల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ నెల 19న పురుషుల దినోత్సవం వన సమారాధన జరుగుతుందన్నారు.


టైలర్ కు కుట్టు మిషన్‌అందజేస్తున్న హరీష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబానికి కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి-కరప

వేళంగిలో జరిగిన అగ్నిప్రమాదంలో టైలర్ కొప్పిశెట్టి లోవరాజు వికలాంగుడు ఉపాధి కోల్పోయిన సంగతి తెలుసుకున్న కాకినాడ పట్టణానికి చెందిన తలాటం హరీష్ తమ హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయం అంద జేశారు. బాధిత టైలర్ కుటుంబానికి ట్రస్ట్ ద్వారా రూ.11,000తో కుట్టు మిషన్‌ను ఒక మోటారును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్, సాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ కాకినాడ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సహకారంతోనే స్మార్ట్ సిటీ ని క్లీన్ కాకినాడగా చేయగలమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఆయన14వ సర్కిల్ పరిధిలోని గోకులం, ఐడియల్ కళాశాల ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిం చారు. కొన్నిచోట్ల చెత్తను రోడ్లపై వేయడాన్ని గమనించారు. మరికొన్నిచోట్ల వేర్వేరుగా డస్ట్ బిన్ లు అందుబాటులో ఉన్నప్పటికీ తడి పొడి చెత్తను కలిపి ఇస్తున్న విషయాన్ని గుర్తించారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్లే కొన్నిచోట్ల ఇటువంటి పరిస్థితి ఎదురవుతోందని, దీనిపై శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు చొరవ తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకష్ణ సచివాలయ కార్యదర్శులు సిబ్బంది ఉన్నారు.

నేడు వికాస జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్:

వికాస, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ " ఆధ్వర్యంలో ఈ నెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడి కరణం లచ్చారావు ఓ ప్రకటనలో తెలి పారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఎం.ఎన్.సి, సాఫ్ట్వేర్ , ఫార్మా , బ్యాంకింగ్, టెక్నికల్ తదితర 60కు పైగా కంపెనీల్లో సుమారు 3000 కు పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, దివ్యాంగులకు, అనాథలకు కూడా వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. హెచ్.సి.ఎల్, సాగర్సాఫ్ట్ సొల్యూషన్స్, హాల్మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్, మేకరైమైండ్ సాఫ్ట్ సొల్యూషన్స్, గెబ్స్ హెల్త్ కేర్ సొల్యూషన్స్, సదర్లాండ్స్, అపోలో హాస్పటల్స్, సైలెంట్ మైండ్స్, డ్రీమ్, ఐటెక్ సాఫ్ట్వేర్ సొల్యూషన్, ఐ.సి.ఐ.సి.ఐ (నిట్) బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి, ఎస్ఐ తదితర ప్రముఖ కంపె నీల్లో ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 18 నుండి 40 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000/- నుండి రూ.50,000/ వరకు జీతం ఇన్సెంటివ్స్ ఉచిత వసతి, భోజనం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థుడ లందరూ ఈనెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడ వద్ద ఉదయం 9 గంటకు సర్టిఫికెట్స్ జెరాక్సతో హాజరుకావలెను. వివరాలకు 8297400666, 7799376111 నంబర్లను సంప్రదించా లన్నారు.

నేరాలు ఘోరాలు

జాతీయ రహదారిపై మహిళ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని రామవరం వద్ద డివైడర్ దాటుతూ పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన గండేటి వెంకటలక్ష్మిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతురాలు వెంకటలక్ష్మి రామవరం లోని సంబంధిత బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో జాతీయ రహదారిపై వాహనం ఢీకొనడంతో మతి చెందినట్లు తెలిపారు. వాహనాన్ని ట్రేస్ ఓట్ చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వేధింపుల కేసులో భర్త, అత్తలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

భార్యను వేధించిన కేసులో భర్త, అత్తకు ఏడాదిన్నర జైలు శిక్ష, ఒక్కొక్కరికి 16,000 జరిమానా విధిస్తూ కాకినాడ అదనపు జేఎఫ్‌సిఎం న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పారని కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ గ్రామీణ తూరంగికి చెందిన దామి శెట్టి రమాదేవికి వీరేంద్రకుమార్‌తో 2012లో వివాహమైంది. ఆమెను అద నపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తలు వేధిం చినట్లు రమాదేవి ఫిర్యాదు మేరకు 2017లో కాకినాడ దిశ మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున కేసును రఘువీర్ వాదించారు.

వేధింపుల కేసులో అత్తమామలకు జైలు శిక్ష

కోడల్ని వేధించిన కేసులో అత్తమామలకు ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో అదనపు జె.ఎఫ్.సి. ఎం.న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పిట్టు కాకినాడ దిశ పోలీసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన తలుపులమ్మ దేవికి అదే ప్రాంతానికి చెందిన శివ కుమార్‌తో 1999లో వివాహమైయింది. 2016లో భర్త, అత్తమామలు, మరిది, తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వాదోపవాదనలు ను విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

కోడి పందేలపై పోలీసులు దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తి గ్రామ శివారు, పెద్దనా పల్లిలోనూ కోడి పందాలు, పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు. వారి వద్ద నుండి రెండు కోళ్లు రూ.3000 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కాని స్టేబుల్ పండు శ్రీనివాస్ ఈశ్వర్లతో పాటు ఎపిఎస్‌పి సిబ్బంది ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ 1,12,556 విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని వల్లభ స్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహణకు యాత్రికులు శనివారం రూ.1,12,556 విరాళాలుగా అందజే శారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన అడపా వీరబాబు నిత్యాన్నదాన పథకానికి రూ.15,001 విరాళంగా అందజేశారన్నారు. వివిధ టిక్కెట్ల ద్వారా శనివారం రూ.1,73,960 ఆదాయం సమకూ రిందన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతను అలవర్చుకుంటూ పోటీ పరీక్షలలో పాల్గొనాలని ఎంఇఒ రామచంద్రరావు, మండల అభివృద్ధి అధికారి ఐదం రాజులు అన్నారు. నాసా స్పేస్ ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేసిన తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను వారు శనివారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2022- 23 సంవత్సరానికి సంబంధించి 36 మంది విద్యార్థులు తమ స్కూల్ నుంచి నాసాకి ఎంపిక కావడం ఆనందదాయకంగా ఉందన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించేలా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వారు నిర్వహించు పొలంబడులు, తోటబడుల్లో చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.ఆనంద కుమారి పేర్కొన్నారు. శనివారం అమలాపురం వ్యవసాయ సబ్-డివిజన్‌లోని అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అమలాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేకాట శిబిరం పై దాడి నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాటవరం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసలు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామ శివారులో పేకాటశిబిరం నిర్వహిస్తురని ఎస్ఐ శుభ శేఖర్ కు సమాచారం అందింది. ఆయన సిబ్బందితో కలిసి పేకాట శిబిరం పై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 7 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

సిఎం జగన్ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-మండపేట

. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కల్లుగీత కార్మికుల క్షేమం కోసం సిఎం జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ చిత్రపటానికి మండపేట శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం గీత కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. గణేశ్వరరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే చెల్లించే పరిహారాన్ని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. సహజ మరణం చెందితే వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.ఐదు లక్షల పరిహారం చెల్లిస్తుంద న్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పెంకే గంగాధర్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి మద్యం షాపులో శుక్రవారం అర్ధరాత్రి సుమారు రూ.2 లక్షల 17వేల నగదు చోరీ అయ్యింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలివి.. శుక్రవారం అమ్మకాలు జరిగిన సొమ్మును మద్యం షాపులో పనిచేసే ఉద్యోగులు ఇనుప పెట్టిలో భద్రపరిచి రాత్రికి ఇంటికి వెళ్లారన్నారు. అయితే మద్యం షాప్‌కు ఇద్దరు కాపలాదారులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు చోరీ రాత్రి రెండు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం మద్యం షాప్ ఉద్యోగులు నగదు చోరీ జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి కాకినాడ నేర పరిశోధన సంస్థ (క్లూస్ టీం) చేరుకుని ఆధారాలను సేకరించారు.

సమస్యలు తాళలేక విఆర్‌ఎ ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరంలో కుటుంబ, ఆర్థిక సమస్యలను తాళలేక విఆర్‌ఎ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పత్రా సుభాష్ చంద్రబోస్ సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరం విఆర్‌ఎగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఏడేళ్ల క్రితం అతనికి పక్షవాతం వచ్చింది. అతను కుటుంబ, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. అయితే అతనికి కుమారుడు నిరుద్యోగి. వివాహమైన కుమార్తెకు భర్త చనిపోయి ఆమె కూడా తండ్రి వద్దే ఉంటోంది. ఈ పరిస్థితులను తట్టుకోలేక చంద్రబోస్ శుక్రవారం ఉదయం తన ఇంటి వద్ద పురుగుమందులు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందతూ అతను శుక్రవారం సాయంత్రం మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. రామకృష్ణ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఫ్యాక్టరీలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు ఇవి.. దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులో త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ కి చెందిన సురేష్(36) ఫ్యాక్టరీలో తయారయ్యే పాటర్న్ గ్లాసును తీసే సమయం లో కాలు జారి గ్లాసు అంచు మీద పడగా ఎడమ వైపు మెడ దగ్గర తెగి రక్తస్రావమైంది. ఫ్యాక్టరీ సిబ్బంది అతనిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. ఆస్పత్రి సమాచారం పై కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శనివారం తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి -మండపేట

నియోజకవర్గంలో గత కొద్ది రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వరిన కోసిన రైతులు ఆందోళనలో ఉన్నారని దానికి శుక్రవారం కురిసిన వర్షమే నిదర్శనమనన్నారు. గత రెండు పంటలకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు

ప్రజాశక్తి-రాజోలు

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చి, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు తెలిపారు. శనివారం సఖినేటిపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అంతర్వేది, బెల్లంకొండ వారి కొడప నందు మనబడి నాడు-నేడు రెండవ విడత కార్యక్రమంలో భాగంగా రూ. 35,98,714లక్షలతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.